ఖరీఫ్ ముందస్తు సాగుకు సన్నద్ధం

- కాలువలను నీటిని విడుదల చేసిన అధికారులు
- వరినారు మడుల పనులకు అన్నదాతల శ్రీకారం
- నియోజక వర్గంలో 36,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు



ఖరీఫ్ సాగు కోసం అజ్జరంలో దుక్కి దున్నిన పొలం



ఆకుమడి కోసం ఉసులుమర్రులో పట్టి తోలుతున్న రైతు

పెరవలి: ఖరీఫ్ ముందస్తు సాగుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందుకనుగుణంగా జూన్- 1నే అధికారులు కాలువలకు నీటిని విడుదల చేశారు. నీరు అందుబాటులోకి వస్తుండడంతో రైతులు తొలకరి సాగుకి శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే ప్రధాన కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. చిన్న, పిల్ల కాలువలకు రావడానికి మరో మూడు రోజుల సమయం పడుతుంది. ఈ లోగా రైతులు పొలాలను దుక్కిదున్ని విత్తనాలు చల్లేందుకు అనువుగా తీర్చిదిద్దుతున్నారు. నీరు వచ్చిన వెంటనే ఆకుమడుల వేయడానికి, దమ్ములు చేయటానికి సిద్ధమవుతారు. నిడదవోలు నియోజకవర్గంలో ఏటా 36,500 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు జరుగుతోంది. మండలాల వారీగా నిడదవోలులో 16,500, ఉండ్రాజవరంలో 11,500, పెరవలిలో 8,500 ఎకరాల్లో సాగవుతుంది. విత్తన సాగు చేసే రైతులు బోర్ల సాయంతో ఆకుమడులు వేయడానికి వీలుగా చేలను దమ్ము చేసి సిద్ధంగా ఉన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపానుల వంటి వైపరీత్యాలు ఎక్కువ. జూన్ నెలాఖరు లేదా జూలై ప్రథమార్థంలోనే వరినాట్లు పూర్తయితే అక్టోబర్‌లోనే వరి పంట కోతకు వస్తుంది. దీనివల్ల పండిన పంట తుపానుల వల్ల నష్టపోకుండా సురక్షితంగా రైతులు ఖరీఫ్ సాగు నుంచి గట్టెక్కుతారని అధికారులు చెబుతున్నారు.

ఏయే వంగడాలు..

ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు స్వర్ణ, పిల్ రకాలతో పాటు పీఎల్‌ఏ- 1100, ఎంటీయూ- 1064, ఎంటీయూ-1061, ఎంటీయూ- 1229 రకాల వరి వంగడాలను సాగు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. మరికొందరు రైతులు సన్న రకాల సాగుపై మక్కువ చూపుతున్నారు. పెరవలి మండలంలోని ఉసులుమర్రు, తీపర్రు, కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల రైతులు ఎక్కువగా విత్తన సాగు చేస్తారు. మిగిలిన గ్రామాల్లో యథాస్థితిగా వరి సాగు చేస్తారు. ముందస్తు ఖరీఫ్ సాగుకు వీలుగా ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు రైతులను సమాయత్తం చేస్తున్నారు. ఇందుకోసం అధికారులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ముందస్తు సాగు వల్ల ఒనగూరే లాభాలను, వరినాట్లు ఆలస్యం అయితే ఎదురయ్యే నష్టాల గురించి రైతులకు వివరిస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ మాట్లాడుతూ ఆలస్యంగా వరి నాట్లు వేయడం వలన ఏటా పంటలు ప్రకృతి వైపరీత్యాల బారిన పడి వలన రైతులు నష్టపోతున్నారన్నారు. అందుకే ఈ ఏడాది ముందస్తు సాగుకు వీలుగా రైతులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సొసైటీలతో పాటు డీసీఎంఎస్ వద్ద సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

సకాలంలో నీరు విడుదల



ఖరీఫ్ సాగుకు జూన్ ఒకటో తేదీనే కాలువలకు నీటిని వదలడంతో రైతులు ముందస్తు సాగుకు సమాయత్తం అవుతున్నారు. నీరు రావటానికి మూడు రోజుల సమయం పడుతుంది. అందుకే బోర్ల సాయంతో ఆకుమడుల దుమ్ము చేసి విత్తనాలు వేస్తున్నాం.

-పువ్వులు శ్రీనివాస్, రైతు, కాపవరం, పెరవలి మండలం

అక్కరకొచ్చిన పెట్టుబడి సాయం



ప్రభుత్వం అందించిన పెట్టుబడి సాయం ఖరీఫ్ సాగుకు ఉపయోగపడుతోంది. చేను దమ్ము చేయడతో పాటు నాట్లు వేసే వరకూ ఈ సాయం సరిపోతుంది. విత్తనాలు అందుబాటులో ఉంచారు. ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రభుత్వం రైతులకు చేయగలిగినంత సాయం చేస్తోంది.

-మేడపాటి సూర్రెడ్డి, రైతు, అజ్జరం, పెరవలి మండలం

క్లుప్తంగా

మూతబడిన జీడిపప్పు తయారీ కేంద్రాలు



తాడిమళ్లలో మూతబడిన జీడిపప్పు తయారీ కేంద్రం వద్ద మహిళా కూలీలు

నిడదవోలు రూరల్: మార్కెట్లో జీడిపప్పుకు డిమాండ్ పడిపోవడంతో జీడిపప్పు తయారీ కేంద్రాలు ఈనెల 1నుంచి మూతబడ్డాయి. ఆషాఢ మాసంతో పాటు జూన్, జూలై నెలల్లో పప్పు విక్రయాలు బాగా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. దాంతో రెండు నెలల పాటు జీడిపప్పు ఫ్యాక్టరీలను మూసివేస్తున్నట్లు జీడిపప్పు వ్యాపారులు వద్దిరెడ్డి శ్రీను, రాచపోతు గణేష్, దిరిసిపల్లి నాగబాబు తెలిపారు. దీంతో నిడదవోలు మండలం తాడిమళ్ల, సూరాపురం, చాగల్లు మండలం చిక్కాల గ్రామాల్లో ఉన్న సుమారు 35 జీడిపప్పు ఫ్యాక్టరీలు గుండు, బద్ద, ముక్కగా తయారుచేసే మహిళా కూలీలు ఉపాధి కోల్పోయారు. పప్పు వ్యాపారం జరగడం లేదని, ప్రస్తుత జీడిపప్పు నిల్వలు పేరుకుపోవడంతో పాటు గత్యంతరం లేకపోవడంతోనే జీడిపప్పు పరిశ్రమల మూసివేశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పప్పు నాణ్యత కూడా బాగా దెబ్బతిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లీ కూతుళ్ల ఉపాధికి రేషన్ డిపో

ప్రారంభించిన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్



రేషన్ డిపోను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్. చిత్రంలో సొసైటీ అధ్యక్షుడు సూరిబాబు

పెరవలి: మండలంలోని లంకమాలపల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన రేషన్ డిపోను శుక్రవారం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రారంభించారు. ఈ గ్రామానికి చెందిన పాలమూరి పింకీ ఇటీవల కొద్దిరోజుల వ్యవధిలో తన తండ్రిని, సోదరుడ్ని, తాతను కోల్పోయింది. ఆమెకు తల్లి మినహా మరెవరూ లేదు. దాంతో ఆ కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది. కొద్ది రోజుల క్రితం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు ఈ గ్రామానికి వచ్చిన నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడికి ఆ తల్లీకూతుళ్లు కలిసి తమ పరిస్థితి వివరించి, ఉపాధి మార్గం చూపాలని కోరారు. దాంతో ఎమ్మెల్యే స్పందించి పింకీ పేరిట ఈ రేషన్ డిపోను మంజూరు చేశారు.ఈ సందర్భంగా పాలమూరి పింకీ మాట్లాడుతూ రేషన్ డిపో ఇప్పించి తమ కుటుంబానికి ఆసరాగా నిలిచిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు, ఆర్ఐ, సివిల్ సప్లయ్ డీటీ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్



ఎస్ ముప్పవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దేవి

చాగల్లు: వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ డాక్టర్ పీఆర్ఎల్ దేవి సూచించారు. మండలంలోని బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 110 మందికి డాక్టర్ దేవి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఆమెను పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవి మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నపుడు ప్రయాణం చేయవద్దన్నారు. ఒకవేళ వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచి, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పి.రేవతి, కె.అనూష, ఆరోగ్య సహాయకుడు డివి రామకృష్ణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నవధాన్యాలు, పచ్చిరొట్ట కిట్ల పంపిణీ

పెరవలి: ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను పొందడమే గాకుండా భూములకు రక్షణ ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ అన్నారు. మండలంలోని పిట్టల వేమవరం గ్రామంలో శుక్రవారం ఆయన రైతులకు నవధాన్యాలు, పచ్చిరొట్ట కిట్లను అందించారు. ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగు వలన సాగు భూములకు ఎకరానికి 10 టన్నుల ఎరువు అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట్రావు, విద్య, లత, రైతు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో ప్రగతి పథంలో రాష్ట్రం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నల్లజర్లలో కొనసాగుతున్న గడప గడపకూ..



మహిళలకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: నవరత్న పథకాల అమలుతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నల్లజర్ల గ్రామంలో ఉత్సాహంగా సాగుతోంది. అధికారులు, సిబ్బందితో కలసి ఎమ్మెల్యే ఏడో రోజైన శుక్రవారం గ్రామంలోని 10, 11 వార్డులలో పర్యటించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ఉన్న బుక్‌లెట్లను ప్రజలకు అందించారు.

ఎమ్మెల్యే దృష్టికి..

తమ ప్రాంతంలో సీసీ రోడ్లు వేయించాలని కొందరు స్థానికులు ఎమ్మెల్యే వెంకట్రావును కోరారు. సత్యసాయి మంచినీటి సరఫరా పథకాన్ని పునరుద్ధరించాలని, డ్రైనేజీలను ఆధునీకరించాలని, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్లస్థలాల సమస్యలను పరిష్కరించాలని రెండు వార్డుల ప్రజలు కోరారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయ కుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, మేణ్ని యువ రాజు, నీరుకొండ జయకృష్ణ, కండెపు రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

- విధుల్లో చేరిన ఏడుగురు అధ్యాపకులు
- ఫస్టియర్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నల్లజర్ల ప్రభుత్వ కళాశాలలో చేరిన అధ్యాపకులు

నల్లజర్ల: వేసవి సెలవుల అనంతరం ఇంటర్ మీడియెట్ తరగతులు ప్రారంభం అయ్యాయి. ప్లస్-2 విద్యాబోధనను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అధ్యాపకుల నియామకాలు పూర్తి చేసింది. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలలో గత వారమే అన్ని సబ్జెక్టులకు ఏడుగురు అధ్యాపకులు విధుల్లో చేరారు. దీంతో ఈ కళాశాలలో అధ్యాపకుల సమస్య తీరినట్టయింది. గురువారం నుంచి తరగతులు ప్రారంభం కావడంతో పాఠ్యాంశాల బోధన ప్రారంభించారు. తెలుగుకు బి.నీరజ, ఇంగ్లిషుకు భువనేశ్వరి, గణితం సత్యనారాయణ, బోటనీకి జి.చిట్టిబాబు, జువాలజీకి బి.నాగమణి, ఫిజిక్స్‌కు బి.లక్ష్మి, కెమిస్ట్రీకి కె.సూర్యనారాయణ విధుల్లో చేరినట్టు హెచ్ఎం కోమలి చిత్ర తెలిపారు.

ఎటువంటి ఫీజులు లేకుండా ఇంటర్ విద్యాభ్యాసం చేయవచ్చన్నారు. అన్ని వసతులూ ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించాలని ఆమె తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ సీట్లు వివరాలు..

ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని హెచ్ఎం కోమలి చిత్ర చెప్పారు. ఎంపీసీలో-40, బైపీసీలో -40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ బాలికలు మాత్రమే చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఈనెల14 లోగా ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కిడ్నీ బాధితుడికి రూ.10 వేల పింఛను



కిడ్నీ వ్యాధిగ్రస్తుడైన బాలుడికి పింఛను సొమ్ము అందిస్తున్న రామమోహన్‌రెడ్డి



పింఛన్ అందిస్తున్న వలంటీర్ సింహాద్రి రామలక్ష్మి

గోపాలపురం: కిడ్నీల వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న ఓ బాలుడికి రాష్ట్ర ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. ఆ పింఛను సొమ్మును గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారుడికి అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. గోపాలపురానికి చెందిన కిడ్నీల వ్యాధిగ్రస్తుడైన కుడిదల సాయికిరణ్ కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటూ నెట్టుకొస్తున్నాడు. వలంటీర్ సహాయంతో ఆ బాలుడు పింఛను కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ బాలుడికి నెలకు రూ.10 వేల చొప్పున పింఛను మంజూరు చేసింది. ఈ మొత్తానికి తన సొంత సొమ్ము రూ.5 వేలు జత చేసి మొత్తం రూ.15 వేలను సొసైటీ చైర్మన్ కూసం రామ మోహన్‌రెడ్డి శుక్రవారం ఆ బాలుడికి గోపాలపురం పంచాయతీ కార్యాలయం వద్ద అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం. చినవెంకాయమ్మ, వలంటీర్లు ఉన్నారు.

భీమవరం వెళ్లి.. పింఛను అందజేత

నిడదవోలు: పట్టణంలోని 2వ వార్డులో నివాసం ఉంటున్న శ్రీపాద వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు పక్షవాతంతో బాధ పడుతుతూ ప్రస్తుతం భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సంహాద్రి రామలక్ష్మి తన సొంత ఖర్చులతో శుక్రవారం భీమవరంలోని ఆసుపత్రికి వెళ్లి వెంకటేశ్వర్లుకు వృద్ధాప్యపు పింఛన్ అందించారు. వలంటీర్ రామలక్ష్మిని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వార్డు కౌన్సిలర్ ఆలమూరి భారతిలు అభినందించారు.

తిరుగుడుమెట్టలో జాతర సందడి




తిరుగుడుమెట్ట గ్రామదేవత జాతరలో హోం మంత్రి తానేటి వనిత తదితరులు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామదేవత తిరుగుళ్లమ్మ, సోమాలమ్మల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవార్లను శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక నాయకులు ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ వల్లభశెట్టి గంగాభవానిల ఆహ్వానం మేరకు విచ్చేశారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి వనితను ఘనంగా సత్కరించారు. అమ్మవారి చల్లని చూపు గ్రామస్తులపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, నాయకులు ఆత్మూరి దొరయ్య, వల్లభశెట్టి చిన్ని, అందుగుల రవి, తదితరులు పాల్గొన్నారు.

బరింకలమ్మ వారి జాతర ప్రారంభం



నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి గ్రామదేవత బరింకలమ్మ వారి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ వీధుల్లో అమ్మవారి సేవ చేశారు. ఈనెల 3న బలిచేట, సాంస్కృతిక కార్యక్రమాలు, 4న అమ్మవారికి నైవేద్యాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. బరింకలమ్మ జాతరతో విద్యుత్ వెలుగులు మధ్య పురుషోత్తపల్లి గ్రామం బంధువులతో కళకళలాడుతోంది.

కొండగూడెం వాసులకు సత్యసాయి తాగునీరు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- అధికారులతో కలసి గ్రామంలో పర్యటన



పాడైన బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు

దేవరపల్లి: గౌరీపట్నం శివారు కొండగూడెంలోని క్వారీ కార్మికుల కాలనీలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, భూగర్భజలాల విభాగం డీఈఈ శుక్రవారం సాయంత్రం పర్యటించారు. పంచాయతీ మోటార్ మరమ్మతుల వల్ల ఇక్కడ మంచినీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు ఇటీవల రాష్ట్ర ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. సమస్యను ఎమ్మెల్యే తలారి కలెక్టర్ కె.మాధవీలత దృష్టికి తీసుకు వెళ్లగా 10 వేల లీటర్ల వాటర్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణానికి ప్రత్యేక నిధులు రూ.15 లక్షలు కలెక్టర్ మంజూరు చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు గ్రామంలో పర్యటించారు. మంచినీటి ఎద్దడి గురించి ప్రజలు ఎస్ఈ బాలశంకరరావుకు వివరించారు. కొండపైభాగన గల పంచాయతీ బోరును, గృహనిర్మాణ సంస్థ ప్రాంగణంలోని బోరును పరిశీలించారు. రెండు బోర్లకు, పూడిక తీసి కొత్త మోటార్, పంపులు ఏర్పాటు చేయాలని, 10 వేల లీటర్ల ట్యాంకు నిర్మాణం రేసి, పైపులైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధికారులకు సూచించారు. రెండు బోర్లు ఫ్రెషింగ్ చేసి, మోటారు ఏర్పాటు చేస్తామని, కాలనీకి దిగువన గల రెండు మినీ ట్యాంకులకు సత్యసాయి మంచినీరు నింపి ప్రజలకు సరఫరా చేస్తామని ఎస్ఈ బాలశంకరరావు తెలిపారు. కొండగూడెం పంచాయతీకి జలజీవన్ మిషన్ నిధులు రూ.14 లక్షలు మంజూరైనట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుతరావు, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కొండ పథకంపై అవగాహన

చాగల్లు: బంగారు కొండ పథకంపై అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలకు శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఐసీడీఎస్ సీడీపీవో మమ్మీ మాట్లాడారు. అంగన్‌వాడీల్లోని చిన్నారులను దత్తత తీసుకుని ఆరు నెలల పాటు అంగన్ వాడీ వర్కర్, ఏఎన్ఎం, సూపర్‌వైజర్ పర్యవేక్షణలో వారికి పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. మెనూ ప్రకారం చిన్నారులు ఆహారం తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆ మెనూకు అయ్యే ఖర్చు నెలకు రూ.500 చొప్పున 6 నెలలకు రూ.3000 ను బాలమిత్ర ఖాతాల్లోకి దాతల సహాయంతో జమచేసి పోషకాహారం అందించాలన్నారు. ఆరు నెలల్లో చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే బంగా రు కొండ లక్ష్యం అన్నారు. తహసీల్దా ర్ కె.రాజ్యలక్ష్మి, ఎంఈవో వి.ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

తాళ్లపూడి: బంగారు కొండ పథకం ద్వారా ఐదేళ్ల లోపు చిన్నారులు ఆరోగ్యవంతులుగా తయారవుతారని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. ఈ పథకంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి పి.జగదాంబ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో, దాతల సహకారంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బరువు తక్కువ ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరు: ఎత్తుకు, వయస్సుకు తగిన బరువు, వయస్సుకి తగిన ఎత్తులేని ఐదేళ్ల లోపు పిల్లలు బంగారు కొండ పథకానికి అర్హులని డీఎల్‌డీవో శాంతామణి అన్నారు. బంగారు కొండ పథకంపై మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లోపాలున్న చిన్నారులను గుర్తించి సాధారణ స్థితికి తీసుకుని రావడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు.సీడీపీవో డి.మమ్మీ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంపీడీవో కె.ప్రసన్న కుమార్, ఎంఈవో జె.కెంపురత్నం, అంగన్ వాడీ సూపర్ వైజర్‌లు, ఏఎన్ఎంలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో బోర్ ప్రారంభం

తాళ్లపూడి: వేగేశ్వరపురం పంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యల్లో భాగంగా బోరు ఏర్పాటు చేసినట్టు ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు శుక్రవారం తెలిపారు. రూ.4 లక్షలతో కొత్త బోరుకు రూ.4 లక్షలు, మోటార్, విద్యుత్తు కనెక్షన్ కోసం రూ.3 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. కొత్త బోరు నుంచి శుక్రవారం ఆయన నీటిని విడుదల చేసారు. ట్యాంక్‌ను కూడా నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, నాగాంజనేయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

7న వాహనాల వేలం

కొవ్వూరు: ఎస్ఈబీ, కొవ్వూరు స్టేషన్ పరిధిలో సారా, ఇతర కేసుల్లో పట్టుబడిన మూడు మోటార్ సైకిళ్లకు ఈనెల ఏడో తేదీ ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం నార్త్ ఎస్ఈబీ స్టేషన్‌లో వేలం వేస్తారు. ఈ విషయాన్ని కొవ్వూరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలని, ఆధార్ కార్డు జిరాక్సు అందజేయాలన్నారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న పాటదారుడు మొత్తం సొమ్ముతో పాటు 18 శాతం జీఎస్‌టీతో కలిపి వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 94409 02430 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ హిత జీవన శైలి అవసరం

నల్లజర్ల: మన జీవన విధానం పర్యావరణానికి మేలు చేసేదిగా ఉండాలని నల్లజర్ల సెక్షన్ ఫారెస్ట్ డీఆర్వో చల్లా శ్రీనివాసరావు అన్నారు. వనసంరక్షణ సమితి సభ్యులకు శుక్రవారం ఆయన చీపురుగూడెం రిజర్వు ఫారెస్ట్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్- 211 వద్ద పర్యావరణ హిత జీవన శైలిపై అవగాహన కల్పించారు. మిషన్ లైఫ్ (పర్యావరణ హిత జీవనం)లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. నీటి సంరక్షణ, ఇంధన పొదుపు పాటించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, సంచుల వాడకాన్ని నిషేధించాలని సూచించారు. అప్పుడే మన ఆరోగ్యం కూడ బాగుంటుందన్నారు. 'పర్యావరణ పరిరక్షణ మా బాధ్యత ' అంటూ ఈ సందర్భంగా వీఎస్ఎస్ సభ్యులతో శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. అటవీ ప్రాంతంలోని ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను ఏరివేయించారు. వీఎస్ఎస్ సభ్యులతో పాటు బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు: జాతీయ రహదారిపై పట్టణ శివార్లలోని ఏషియన్ పెయింట్స్ గోదాము సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన లుట్టా అప్పారావు (53) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం అప్పారావు తన కుమార్తెకు విశాఖలోని ఓ ఆసుపత్రిలో సర్జరీ చేయించాడు. కుమార్తెకు తోడుగా భార్య శ్యామలను ఆసుపత్రిలో ఉంచి, అప్పారావు తన స్కూటీపై స్వగ్రామం బయలు దేరాడు. ఘటనా స్థలానికి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిడదవోలు: తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిడదవోలులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన మహిళా రెజ్లర్లకు న్యాయం చేకూర్చాలని, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈమని గ్రీష్మ కుమార్, తీపర్తి వీర్రాజు, పామర్తి సత్యనారాయణ, పిచ్చా సూర్యకిరణ్, కోనేటి మల్లేశ్వరరావు, నూతంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదావరికి మహా నీరాజనం

కొవ్వూరు: శోభకృత్ నామ సంవత్సరం జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా శనివారం సాయంత్రం కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించనున్నట్లు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగోట్ల కృష్ణారావు తెలిపారు .212 మాసోత్సవంలో భాగంగా గోదావరి మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం హారతి సమర్పిస్తామని తెలిపారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

కొవ్వూరు: హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రాజీవ్ కాలనీలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు.శివాజీ భారతీయధర్మాన్ని, సంస్కృతిని, సమాజాన్ని సంరక్షించిన అగ్రగణ్యుడని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర ఈ సందర్భంగా అన్నారు. శివాజీ గొప్పతనం గురించి వక్తలు మాట్లాడారు. గోవర్ధనం శ్రీనివాసమూర్తి, ఉప్పాడ భూచక్రవర్తి, యజ్జల రవి, గుత్తుల నాగారాజు, బెళ్ల పుకొండ వీర మణికంఠ, మైలపల్లి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు పంటకు ప్రత్యామ్నాయం లేదు

గోపాలపురం: వర్జీనియా పొగాకు ఉత్పత్తిని నిలుపుదల చేయాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ షరతులు విధించడాన్ని పొగాకు రైతులు తప్పుబట్టారు. గురువారం వరల్డ్ అండర్ స్టాండింగ్ టొబాకో ఫార్మింగ్ డే సందర్భంగా భారత ప్రధాని, మంత్రిత్వ శాఖలకు వారు లేఖ రాసి తమ నిరసన తెలిపారు. ఈ విషయాన్ని పొగాకు రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం గోపాలపురంలో ఒక ప్రకటనలో తెలిపారు. పొగాకు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు గద్దే శేషగిరిరావు, గోపాలపురం పొగాకు వేలం కేంద్రం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్ మాట్లాడుతూ భారతదేశంలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు లేవన్నారు. ఏ ఇతర పంటలు లాభదాయకంగా లేవని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించాలని కోరారు.

పాస్‌పోర్టు పోయినది

... నెం. (S1604318) ... సంప్రదించవలసిన నెం. 77026 32876.